
**కథ**

# ఏమవుతోందీ తరం!

- శ్రీభాష్యం పద్మ

ఎప్పటినుండో నా ఫ్రెండ్ హరిణి వాళ్ళింటికి రమ్మని, మరీ మరీ చెప్తోంది. ఈ రోజు ఆదివారం కావడంతో, హరిణి ఇంటిని ఒకసారి పావనం చేద్దాం అనుకున్నాను. హరిణి ఉద్యోగస్థురాలు కావటంతో, ఆదివారం తప్ప ఇంట్లో దొరకదు. దానికి దొరికే ఆ ఒక్కరోజు విశ్రాంతిని నేనెందుకు పాడు చెయ్యాలనే ఉద్దేశ్యంతో వాళ్ళింటికి వెళ్ళే ప్రోగ్రాముని ఎన్నాళ్ళనుంచో వాయిదా వేస్తూ వస్తున్నాను. కానీ హరిణి మరీ, మరీ చెప్పడంతో, నాకూ హరిణిని చూడాలని వుండడంతో, ఈరోజు తప్పని సరిగా వెళ్ళాలనే ఉద్దేశ్యంతో పనులన్నీ తొందరగా తెముల్చుకోవడం మొదలుపెట్టాను.




హరిణి, నేనూ, ఎలిమెంటరీ క్లాసు నుంచి, కాలేజీ వరకూ కల్సి చదువుకున్నాం. ఆ రోజుల్లో దేహాలే వేరుకానీ, ప్రాణం ఒకటే అన్నట్లుండే వాళ్ళం. మంచి పుస్తకాలు చదవడం, మంచి సంగీతం వినడం, వాటి గురించి చర్చించుకోవడం, కాలేజీలో ఏ పోటీలయినా ముందుండడం, వీటితో జీవితం, చైతన్య స్రవంతిలా వుండేది. కాలేజీ చదువయిపోవడంతోనే, మాకు పెళ్ళిళ్ళవడం, మేం సంసారపు చట్రంలో చిక్కుకుపోవడం జరగడంతో, మా మధ్య కొంచెం గ్యాప్ ఏర్పడి, పిల్లలు పుట్టడంతో పెరిగి, హరిణి, వాళ్ళాయన తెచ్చే వేణ్ణీళ్ళకి, తను చన్నీళ్ళు జోడించడం, మొదలు పెట్టిన దగ్గర్నుంచీ, ఆ గ్యాప్ పెద్దదై పోయింది. ఒకే ఊళ్ళో వుండడంతో, ఏదో, అప్పుడప్పుడు కల్సుకోవడం మాత్రం జరుగుతోంది. మేమేనా ఒకళ్ళని విడిచి ఒకరం వుండలేక పోయే వాళ్ళం ఒకప్పుడు అని ఆశ్చర్యం కలుగుతుంది. ఇప్పుడు తల్చుకుంటే స్నేహం అనేది ఆడవాళ్ళ మధ్య ఎక్కువకాలం నిలవదేమో బాధ్యతల బరువు వల్ల. మా హాబీలెప్పుడో మమ్మల్ని వదిలిపోయాయి ఇప్పుడు ఒకపుస్తకం చదువుదామన్నా, మంచి సంగీతం విందామన్నా అసలు ఖాళీయే వుండడం లేదు.కొందరు స్త్రీస్వేచ్ఛా వాదులు నాకు సలహా ఇచ్చారు –

"మీరెందుకు బానిసత్వం చెయ్యాలి. మీ వారిని సగం పనులు చెయ్యమనండి. మీరు చదివిన చదువుకి సార్థకతగా మీరు జాబ్ చెయ్యండి" అంటూ.

కానీ నా కెందుకో ఆసలహా నచ్చలేదు. నాకు ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేదు. ఆయన ఒకపెద్ద కంపెనీలో అసిస్టెంట్ మానేజర్ కావడంతో, జీతం మాకు అవసరానికి మించే వస్తుంది. ఆయన ఆఫీసుకీ నియమితమైన సమయం లేదు. మరలాంటప్పుడు, ఆయన్ని, పిల్లల్ని ఇబ్బంది పెట్టి, నేనెందుకు ఉద్యోగం చెయ్యాలి. నా చదువుకు సార్థకతగా నా పిల్లలకు చదువు చెప్పుకుంటే చాలు, ఇంట్లో వుండి. నా హాబీలు డెవలప్ చేసుకుంటే చాలు అనుకున్నాను. కానీ ఇప్పుడసలు ఖాళీయే దొరకడం లేదు. పిల్లలను, ఆయనను, తయారుచేసి, చదువుకు, ఉద్యోగానికి పంపడం, వాళ్ళకు కావల్సినవి అమర్చడం, ఇంట్లో వున్నవీ, లేనివీ చూసుకోవడం, వీటితోనే నా టైమంతా గడిచిపోతోంది. నా హాబీల విషయమే మర్చిపోయాను. అప్పుడప్పుడు అన్పిస్తూవుంటుంది. నేనిలా చేసి, ఆయన్ని, పిల్లల్ని సోమరిపోతుల్లా తయారు చేస్తున్నానేమో అని.

ఆలోచనల్లో పడి పాలు పొంగి పోవడం గమనించలేదు. పాలు స్టవ్ మీద పడి వాసన రావడంతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాను. గబగబా తెమలి పన్లన్నీ చేసుకొని బయల్దేరుతూ, ఆయన్నడిగాను, ఆయన కూడా వస్తారేమో హరిణి ఇంటికని. "సారీ రమా! నేను రాను, ఈ రోజు టి.విలో ఇల్లరికం పిక్చరుంది. చూసి తీరాలి" అనేసారు. ఆయనకి పాత సినిమాల పిచ్చి. పిల్లలిద్దరూ వేరే ఛానల్స్‌లో తమ అభిమాన నటుల సినిమాలు చూడాలన్నారు.

"నో! నో! మీ రిక్వెస్టు నిరాకరించబడుతున్నాయి. ఇవాళ ఇల్లరికం సినిమాయే చూడాలి." డిక్లేర్ చేసేసారు ఆయన. వాళ్ళిద్దరూ మొహం ముడుచుకొని చెరో మూలా కూర్చున్నారు.

నాకు టైమయి పోతూండడంతో, వాళ్ళని ప్రసన్నం చేసే పని వాయిదా వేసి, బండి తీసుకెళ్తున్నానని ఆయనకు చెప్పి, 'కీ' తీసుకొని బయటికి వచ్చాను. బండి స్టార్ట్ చేసి హరిణి ఇంటి వైపు బయల్దేరాను. మళ్ళీ ఆలోచనలు మొదలయ్యాయి.

ఈ పిల్లలు, ఆయనా పూర్తిగా టి.వి.కి ఎడిక్ట్ అయి పోయారు. ఇదే పద్ధతి కొనసాగితే చివరకు ఎలా తయారవుతారో. శాటిలైట్ కనెక్షన్ తీయించెయ్యమంటే వినరు. ఏదో ఆ ఆఫీసుకు, చదువులకు వెళ్ళడం, రావడం, అంతే. ఇంటికొచ్చిన దగ్గర్నుండి, వాళ్ళుండేది టి.వి. ముందే. భోజనం కూడా టి.వి. చూస్తూ చేయాల్సిందే. తినేది ఏం ఒంటబడుతుంది అంటే వినరు.

వినయ్ ఇంకా హైస్కూల్ స్టేజీలోనే వుండడంతో, వాడికున్న హోంవర్కు ఏదో, ఏ తెల్లవారురఝామునో, అర్ధరాత్రో, ఓ పదినిమిషాల్లో గబగబా చేసేసి అయిందనిపించేస్తాడు. వినత కాలేజీ చదువుకు అదీలేదు. ఆయనైతే సరేసరి అఫీసునుండి వచ్చినదగ్గర్నుంచి టి.వి. వదలరు. పోనీ ఆ ప్రోగ్రాములైనా మంచివి చూస్తారా అంటే, అన్నీ సినిమాలకు సంబంధించినవే. ప్రైవేట్ ఛానల్స్‌లో వచ్చేవే అన్నీ ఫిల్మ్ బేసడ్ ప్రోగ్రాములు. ఆ మధ్యలో వచ్చే కొద్ది మంచి ప్రోగ్రాములైనా, కాస్త విజ్ఞానం వచ్చేవి వీళ్ళు చూడరు. టి.వి వల్ల జనం ఎడ్యుకేట్ అవడం మాట అటుంచి పూర్తిగా లేజీగా తయారవుతున్నారేమో అన్పిస్తుంది నాకు. జీవితంలో ఎంటర్ టెయినుమెంటు వుండాలి.కానీ అదే జీవితం కాకూడదు కదా. వీళ్ళని ఈ పిచ్చి నుంచి ఎలా మరల్చాలో నాకు అర్థం కావడం లేదు. ఆలోచనల్లోనే హరిణి ఇల్లు వచ్చింది.

ఆమె పరిస్థితి, మా ఇంటికేం భిన్నంగా లేదు. హరిణి, వాళ్ళాయన, పిల్లలిద్దరూ టి.వి. ముందేవున్నారు, సినిమా చూస్తూ. నన్ను చూస్తూనే హరిణి బయట కొచ్చింది. "రావే రమా! ఎన్నాళ్ళకొచ్చావ్" అంటూ కూర్చోవే! సినిమా క్లైమాక్స్‌లో వుంది ఓ పది నిముషాల్లో అయిపోతుంది. అయిపోగానే మాట్లాడుకుందాం," అంటూ సినిమాలో

మునిగిపోయింది మళ్ళీ. భరించక తప్పుతుందా! అందుచేత నేనూ చూస్తూ కూర్చున్నాను. ఓ పావుగంటలో సినిమా పూర్తయ్యింది.

"నీకు కూడా పట్టుకుందా తల్లీ! ఈ, టి.వి. మేనియా" అడిగాను హరిణిని.

"లేదు! రోజూ చూసేందుకు నాకెక్కడ ఖాళీ అవుతుంది. ఆఫీసుపని, ఇంటిపనితోనే సరిపోతోంది. ఏదో ఈ రోజు ఆదివారం కదా! మంచి సినిమా వస్తోందని కూర్చున్నాను అంతే" అంది.

దాని అష్టావధానం చూసాక, కొత్త పుస్తకాలేమైనా చదివావా? కొత్తకేసెట్స్ ఏమైనా కొన్నావా? అని అడగలేకపోయాను.

"హరీ! నువ్వూ జాబ్ చేస్తున్నావుకదా, టైము ప్రకారం పనిచేసుకోవాలి కదా, ఆయనను, పిల్లలను హెల్ప్ చెయ్య మనకూడదూ కొంచెం," అడిగాను దాని రన్నింగ్‌రేస్ చూడలేక.

"చూస్తున్నావు కదా, వాళ్ళ పరిస్థితి. వాళ్ళు వుంటే బయట వుంటారు. లేదా ఇంట్లో, అదిగో, ఆ టి.వి. ముందు వుంటారు." అంది హరిణి.

"హరీ! నాకూ ఇదే సమస్యగా వుంది. వీళ్ళ నెలా మార్చాలో నాకు అంతుపట్టకుండా వుంది. పోనీ అని వదిలేస్తే పరిస్థితి ఎలా మారుతుందో అని భయంగా వుంది" అన్నాను.

"రమా! ఓ అయిడియా! మా కాలనీ-చివర ఓ సైకాలజీ లెక్చెరర్ వున్నారు. కాలనీ ఫంక్షన్సులో ఆవిడ. నాకు బాగా పరిచయం. ఆవిడను కలుద్దామా? మన సమస్యకు ఏదైనా పరిష్కారం చూపిస్తారేమో." అంది హరిణి.

"అంతకంటేనా! పద, ఇప్పుడే వెళ్దాం" అంటూ బయల్దేరాను.

మేం వెళ్ళేసరికి, ఆ లెక్చెరర్‌గారి అమ్మాయి, ఒక చక్కటి దృశ్యాన్ని కాన్వాసు మీద బంధిస్తోంది. వాళ్ళాయన, అబ్బాయి, ఇంటి ముందు సన్నజాజికి సందిరి వేస్తున్నారు. ఆదృశ్యం, నా కంటికి చాలా ఇంపుగా, అందరిళ్ళలో చూసేదానికి భిన్నంగా కన్పించింది. ఆవిడ చాలా సరదాగా ఆహ్వానించారు మమ్మల్ని. కొంచెంసేపు కాలక్షేపం కబుర్లయ్యాక మా సమస్యని ఆవిడ ముందుంచాం.

"నేనూ ఈ సమస్యని ఫేస్ చేసాను, చాలా రోజులు, బాగా ఆలోచించి ప్లాన్ చేసి, అమలు చేసేసరికి నా సమస్య తీరిపోయింది" అన్నారావిడ. 'మాకు కూడా చెప్పండి' అన్నాం మేం కుతూహలంగా.

"మీకేమైనా హాబీలుండేవా?" అడిగారావిడ. మా సమస్యని ప్రక్కతోవ పట్టిస్తున్నారేమో అని అనుమానం కలిగింది ఆవిడ ప్రశ్న విని. అయినా బయట పడకుండా. "ఆ! చాలా వుండేవి ఒకప్పుడు. పుస్తకాలు చదవడం, సంగీతం వినడం, బొమ్మలు వెయ్యడం, కవితలు రాయడం వగైరాలు. కానీ ఇప్పుడొక్కటి కూడా లేవు. మా సమయమంతా ఇంటి పన్లకే సరిపోతూ వుంటే హాబీలకు తీరికెక్కడిది" అన్నాం నిరాశగా.

"నా పరిస్థితీ ఒకప్పుడు అలాగే వుండేది. నాకింట్లోపనులు, ఉద్యోగంతో అసలు ఖాళీ లేకుండా వుండేది. ఆయన, పిల్లలు, ఎప్పుడూ టి.వి. ముందే వుండేవారు, ఏ చెత్తప్రోగ్రాం వచ్చినావదలకుండా చూస్తూ. నా హాబీలు తీర్చుకోడానికి, సమయం లేదే అని బాధ ఒక పక్క, వాళ్ళు అనవసరంగా సమయం వృధా చేస్తున్నారే అని బాధ ఇంకోపక్క నా మనసుని నిలవనీకుండా చేసాయి. ఏం చెయ్యాలి అని చాలా ఆలోచించాను. గట్టిగా చెప్పినా, నెమ్మదిగా చెప్పినా పిల్లలు వినరు టి.వి చూడొద్దంటే. కనెక్షన్ తీయించేస్తే, కోపం కొద్దీ పక్కిళ్ళకు వెళ్ళి చూస్తారు. అందుచేత అది పరిష్కారం కాదు. వాళ్ళని మెల్లిగా డైవర్ట్ చేయాలి. టి.వి చూడటమే కాదు, మనసుకు ఆనందం కలిగించే పనులు ఇంకా చాలా ఉన్నాయి అని వాళ్ళకు తెలియాలి, అని ఆలోచించి, ఎప్పుడో వదిలేసిన నా హాబీలన్నీ మళ్ళీ గుర్తు తెచ్చుకున్నాను. మంచి పుస్తకాలు తెచ్చి ఇంట్లో వుంచాను. అమృతం అయినా అతిగా తాగితే వెగటు పుడుతుంది కదా! ఆ అవకాశాన్ని నాకు అనువుగా మలచుకున్నాను. టి.వి. చూస్తూ విసుగొచ్చినప్పుడు, 'మమ్మీ! బోర్‌గా ఉంది' అంటూ వచ్చేవారు పిల్లలు. ఆ సమయంలో 'మీ బోర్ పోగొట్టే మంచి ఉపాయం నా దగ్గర ఉంది' అని చెప్పి, నేను తెచ్చిన పుస్తకాలు ఇచ్చి చదవమన్నాను. పుస్తకాలు చదవడం రుచి ఒకసారి తెలిసేసరికి, వాళ్ళకి అందులో అభిరుచి పెరిగింది. ఇంకో విషయం! మీరు పిల్లలను ఏ విధంగా మార్చాలన్నా, ముందు మీకు వాళ్ళతో మంచి అనుబంధం ఉండాలి. మా పిల్లలు ఏ పని చేస్తున్నా, గంటకో, గడియకో నా దగ్గరకు వస్తారు, మమ్మీ! ఏం చేస్తున్నా వంటూ. అందుకే నా ప్రయోగం ఫలించింది. వాళ్ళొచ్చే టైముకి నేను ఏ సంగీతం వింటూనో, పెయింటింగ్ వేస్తూనో కనబడే దాన్ని. వాళ్ళకది కొత్తగా కన్పించి కుతూహలం పెరిగింది. వాళ్ళు ఎరిగిన మమ్మీ ఎప్పుడూ వంటింట్లో పనిచేస్తూనో, సైకాలజీ పుస్తకాలు చదువుతూనో కన్పించేది. ఇప్పుడు కొత్తగా కన్పించేసరికి వాళ్ళకే ఇంట్రస్ట్ కలిగింది. 'మమ్మీ! ఈ పెయింటింగ్ ఇక్కడ, ఇలా వేస్తే బాగుంటుందేమో!' అంటూ సలహాలివ్వడం ప్రారంభించారు. 'ఏదీ మీరు వేసి చూపించండి! మీరే నాకన్నా చాలా బాగా వేస్తున్నారు' అని ఎంకరేజ్ చేస్తూ వాళ్ళకి దానిమీద ఇంట్రస్ట్ కలిగించ గలిగాను. ఇంకోసారి ఒక గులాబీ మొక్క తెచ్చి పెరట్లో నాటాను. అది చూసేసరికి పిల్లలిద్దరికీ సరదా కలిగింది. వాళ్ళూ కూడా కొన్ని మొక్కలు తెచ్చి నాటి, పెంచడం మొదలుపెట్టేసరికి, ఆటోమేటిక్‌గా వాళ్ళు టి.వి. చూసే టైము తగ్గిపోయింది. వాళ్ళకి మెల్లిగా నా హాబీలన్నీ అలవాటు చేసి, నేను మళ్ళీ నా మామూలు పనిలో పడిపోయాను. కానీ నా హాబీలు తీర్చుకోవడానికి సమయం లేదనే బెంగ లేదిప్పుడు నాకు.

"నా హాబీలన్నీ, మంచి సంగీతం వినాలని, మొక్కలు పెంచాలని, ఇంటిని అందంగా అలంకరించాలని, ఇవన్నీ కూడా నా పిల్లల ద్వారా తీరుతున్నాయి నాకు. పిల్లల కంపెనీ లేకపోవడం వాళ్ళు మిగిలిన పన్లలో మునిగిపోవడం చూసిన ఆయన కూడా మెల్లిగా టి.వి నుంచి తప్పుకొని, వాళ్ళ పన్లలో భాగం పంచుకోవడం ప్రారంభించారు. ఇప్పుడు ముగ్గురూ ఖాళీ దొరికితే నాకు హెల్ప్‌కూడా చేస్తున్నారు. అయాం హ్యాపీ నౌ!" అంటూ ముగించారావిడ. మా వాళ్ళ మీద కూడా ఈ ప్రయోగం ఫలిస్తే బాగుండును అనుకుంటూ శలవు తీసుకున్నాం ఆవిడ దగ్గర. ❑



## జి. విద్య

కూచిపూడి నాట్యాభినయంలో గల పదనర్తనకు, ఆంగికాభినయానికి, ముఖాభినయానికి వున్న ప్రాచుర్యాన్ని ఇనుమడింప చేస్తూ, తనదైన ప్రత్యేక బాణీలో నాట్యాభినయం చేస్తున్న కుమారి జి. విద్య, నాట్యశాస్త్ర కోవిదుల, రసజ్ఞుల ప్రశంసలను అందుకుంటున్నారు.

"కృష్ణ పారిజాతం" బాలేలో రుక్మిణిగా కుమారి విద్య, నాట్యాభినయం ఎంతో వున్నత స్థాయిలో రాణకెక్కింది. అభినయంలో విద్య ఏకాగ్రత, గురించి తరచి చూడవలసి వస్తే, తరంగం" ప్రదర్శనలో ఆమె పదనర్తన ప్రత్యక్ష తార్కాణంగా నిలుస్తుంది.

సుప్రసిద్ధ నాట్యాచార్యులు వెంపటిచిన సత్యం, విశాఖపట్నంలో స్థాపించిన కూచిపూడి కళాక్షేత్రంలో శ్రీమతి బాలకొండలరావు వద్ద కుమారి విద్య కూచిపూడి నాట్యాన్ని అభ్యసించింది. 1991లో అరంగేట్రం చేశారు. అప్పటినుంచి నేటి వరకు దేశంలో వివిధ ముఖ్య పట్టణాలలో పలు నాట్య ప్రదర్శనలు యిచ్చారు. కృష్ణాజిల్లా కూచిపూడిలో జరిగిన సిద్ధేంద్రయోగి ఆరాధన ఉత్సవంలో, తిరుపతి వాగ్గేయకార వార్షిక వుత్సవంలో, (ముం)బొంబాయి ఆంధ్రమహాసభ, తెలుగు సాహిత్య సమితి, అన్నమాచార్య కల్చరల్ ట్రస్టు, కాకినాడ సరస్వతీ గాన సభ, విశాఖపట్నంలో రైల్వేవారోత్సవాలు, విశాఖ వుక్కు భారత్ హెవీప్లేట్స్ వంటి ప్రతిష్ఠాత్మక సాంస్కృతిక వుత్సవాలలో పాల్గొని విద్య, మంచి నాట్యకళా కారిణిగా గుర్తింపు పొందారు.

న్యూఢిల్లీలోని సాంస్కృతిక వనరులు మరియు శిక్షణ సంస్థ నుంచి స్కాలర్‌షిప్ స్వీకరించారు కుమారి విద్య.

పిన్నవయస్సులోనే, కూచిపూడి నాట్యాభినయంలో ఉన్నత విలువలతో ఉత్తమ సాంప్రదాయ పథంలో అభినయించి, పలువురి ప్రశంసలను అందుకుంటున్నారు విద్య. - **మల్లిడి సత్తిరెడ్డి**